రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు పరిశీలన




హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను సుమారు రూ.26.6 కోట్లతో చేపట్టడం జరిగిందని సౌత్ సెంట్రల్ రైల్వే జెడ్ఆర్ యుసీసీ మెంబర్ డి.కాశీనాథ్ పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను స్టేషన్‌మాస్టర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌ను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. పనుల్లో జాప్యం లేకుండా, నాణ్యత పాటిస్తూ పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

నేడు హెచ్‌సీయూలో సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్‌ను మంగళవారం 'లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఇనీషియేటివ్(లైఫ్)' అనే థీమ్‌తో నిర్వహించనున్నారు. 'వికసిత్ భారత్-2047'లో భాగంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)చే ప్రారంభించబడింది. వాతావరణ మార్పు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ఆర్థిక చిక్కులు, సాంకేతిక ఆవిష్కరణలు, ఇంధన భద్రత, సామాజిక న్యాయం, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై వివిధ దేశాల విద్యార్థి ప్రతినిధులు చర్చించనున్నారు. దాదాపు 40 నుంచి 50 మంది విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తారు.ఈ కార్యక్రమానికి హెచ్‌సీయూ అర్థశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చిట్టేడి కృష్ణారెడ్డి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.

పగులుతున్న పైపులు..
తాగునీటికి ఇబ్బందులు

నాలుగు రోజులుగా నీళ్లు బంద్



మణికొండ: మంజీరా(సింగూరు) నది నుంచి హైదరాబాద్ నగరానికి మంచినీటిని అందించే పైపులకు కాలం చెల్లింది. దానికి తోడు నీటి అవసరాలు రోజు రోజుకు పెరిగిపోతుండటంతో అదనపు నీటిని తీసుకుంటున్నారు. దీంతో అవి రోజు మార్చి రోజు పగిలిపోతుండటంతో నీటి సరఫరా నిలిచిపోతుంది. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 26న ఖానాపూర్ వద్ద పైపు పగిలిపోవటంతో జంట మున్సిపాలిటీలకు నీటి సరఫరా జరగలేదు. దానిని మరమ్మత్తు చేసి 27న శనివారం కొన్ని కాలనీలకు కొంత మేర నీటి సరఫరా చేశారు. తిరిగి అదే రోజు అర్ధరాత్రి పుప్పాలగూడ ముష్కిచెరువు వద్ద పైపులైన్ మరోసారి పగిలిపోయింది. దీంతో ఆదివారం, సోమవారం సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జంట మున్సిపాలిటీల పరిధిలో గత నాలుగు రోజులుగా నీటి సరఫరా లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. ఆదివారం బోనాల పండగ కావటంతో మరింత ఇబ్బంది పడ్డారు. చేసేదేమి లేక జలమండలి ట్యాంకర్లను బుక్ చేయగా.. ఒకే సారి డిమాండ్ పెరగడంతో రెండు రోజులకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తే వారు రూ. 1200 నుంచి రూ. 2వేల వరకు దండుకుని, నాలుగు గంటలు తర్వాత ఆలస్యంగా సరఫరా చేశారు.



పగిలిన పైపును పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

కొత్త పైపులైన్లు వేయాలి

హైదరాబాద్ నగరంలో కొంత భాగానికి మంచినీటిని అందిస్తున్న మంజీరా పైపులైన్ ఏర్పాటు చేసి దశాబ్దాల కాలం, గండిపేట క్యాం డూట్‌ల నిర్మాణం చేసి శతాబ్ది కాలం కావటంతో పలుచోట్ల లీకేజీలు ఏర్పడి నీరు మొత్తం వృథాగా పోతుంది. వాటి స్థానంలో కొత్త పైపులైన్లు వేయాలని దశాబ్దం క్రితం అప్పటి ప్రభుత్వానికి జలమండలి ఉన్నతాధికారులు రోశయ్య సీఎంగా ఉన్న సమయంలో నివేదికలు పంపారు. వాటికి నిధులు మంజూరు చేయకుండా, పెండింగ్‌లో పెట్టడం, తరచూ పైపులు పగిలి నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటికి ప్రత్యామ్నాయంగా పుప్పాలగూడ సెక్రటేరియట్ కాలనీ, బీఆర్‌సీ అపార్ట్‌మెంట్‌ల ముందు ఏర్పాటు చేసిన 5ఎంజీడీ ఫిల్టర్ బెడ్‌లు ఏర్పాటు చేశారు. కానీ ఆ నీరు ఎటుపోతుందో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. కోకాపేట, పుప్పాలగూడ, గండిపేటలలో మరో మూడు ఫిల్టర్ బెడ్‌లను ఏర్పాటు చేస్తామని జలమండలి ఎండీ ప్రకటించిందని. కానీ నెలలు గడుస్తున్నా ఆచరణకు నోచుకోవటం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం గండిపేట, మంజీరాలకు కొత్త పైపులైన్లు వేయటం, స్థానికంగా ఏర్పాటు చేస్తామని మూడు ఫిల్టర్ బెడ్లను వెంటనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నిధులను రప్పించేందుకు కృషి చేయాలని వారు కోరుతున్నారు.

నేటి నుంచి సరఫరా..

మణికొండ డివిజన్‌లో వరుసగా రెండు చోట్ల పైపులు పగిలిపోవటంతో.. నాలుగు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవటం ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిన విషయం వాస్తవమే. ట్రాన్స్‌మిషన్ విభాగం నీటిని తమకు అందజేస్తేనే తాము సరఫరా చేయగలుగుతాం. దశాబ్దాల క్రితం వేసిన పైపులు ఉండటం, వాటిల్లో నీటిని ఎక్కువగా ప్రజలకు ఇవ్వాలనే ఉద్దేశంతో తీసుకోవటంతో పగిలిపోతున్నాయి. ఫిల్టర్ బెడ్‌ల ద్వారా వచ్చే నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నాం. మరమ్మత్తుల పనులు సోమవారం అర్ధరాత్రి వరకు పూర్తయి మంగళవారం ఉదయం నుంచి నీటి సరఫరా జరుగుతుంది.

\- మహేందర్‌నాయక్, జీఎం

ఘనంగా ఉర్సు ఉత్సవాలు



అత్తాపూర్: సులేమాన్‌నగర్‌లో ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నారు. దర్గాలో వృద్ధులు, పిల్లలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారి మత, ఆచారాల ప్రకారం సాంప్రదాయబద్ధంగా వస్తున్న పద్ధతులను అనుసరిస్తూ ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. శాంతియుతంగా వాతావరణంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ ఉర్సు ఉత్సవాల్లో సజాదా నాషీన్, సయ్యద్ బషరత్ అలీ హుస్సేన్, సయ్యద్ తౌఫిక్ హుస్సేన్, తాహెర్ నవాబ్, సయ్యద్ అయ్యూబ్ అలీ హుస్సేన్, సయ్యద్ రిజ్వాన్ అలీ హుస్సేన్, సయ్యద్ ఇర్ఫాన్ అలీ హుస్సేన్, సయ్యద్ ఇమ్రాన్ అలీ, అజ్మద్ అలీ, మహ్మద్ ఖాజా, మహ్మద్ జాఫర్, మహ్మద్ అమేర్, సయ్యద్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు వందలాదిగా హాజరయ్యారు. ఆషాఢమాసం బోనాల పండుగ సందర్భంగా ఆదివారం దేవాలయంలో భక్తులు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో దేవాలయం కిటకిటలాడింది. బోనాల పండుగ విజయవంతంగా కావడంతో సోమవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ పూజల్లో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



చంద్రమ్మ (ఫైల్)

అత్తాపూర్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ యువతి వెళ్లిపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్ఐ మల్కపురం నందగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలో నివాసముంటున్న జ్యోతి సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీస్ అకాడమీలో హౌస్ కీపింగ్ పనులు చేసుకుంటూ శివరాంపల్లిలో నివాసం ఉంటుంది. ఈమె కూతురు చంద్రమ్మ కర్ణాటక రాష్ట్రంలో హాస్టల్లో ఉంటూ చదువుకుంటుంది. సెలవులు ఉన్నాయంటూ శివరాంపల్లికి వచ్చిన చంద్రమ్మ ఈ నెల 26న మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తన ఇంటి సమీపంలో ఉన్న కాళిదాసును తాను ప్రేమిస్తున్నట్లు తల్లి జ్యోతికి చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొంది.

వృద్ధుడికి పోలీసుల సపర్యలు

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డుపై మతిస్థిమితం లేని వృద్ధుడికి పోలీసులు ఆహారం అందజేసి బట్టలను సరిజేసి మానవత్వం చాటుకున్నారు. డివిజన్ పరిధిలని మధుబన్ కాలనీ ప్రధాన రహదారిపై మతిస్థిమితం లేని, ఆహారం లేకుండా ఓ వృద్ధుడు రెండు రోజులుగా ఉన్నాడని సోమవారం స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు మొబైల్ పోలీసులు వెంటనే వచ్చి అతని వివరాలు అడిగారు. అందుకు ఆ వృద్ధులు సరైన సమాధానం చెప్పకపోవడంతో, మతిస్థిమితం లేకుండా అనారోగ్యంగా ఉన్నాడని 108కు కాల్ చేసి వైద్యుడిని రప్పించారు. ఆకలితో ఉండవచ్చని స్థానికులతో కలిసి ఆహారం అందించడంతోపాటు అతని బట్టలు సరిగా లేకపోవడంతో రోడ్డు ప్రక్కన ఉన్న వారు బట్టలు తెచ్చి ఇచ్చారు. కానీ ఆ వృద్ధుడు లేవలేని పరిస్థితిలో ఉండడంతో, స్థానికుల సహాయంతో మొబైల్ పోలీసులు అతనికి బట్టలు వేశారు. వృద్ధుడి వివరాలు ఎవ్వరికైన తెలిసి ఉంటే పోలీస్ స్టేషన్‌కు తెలుపాలని కోరారు. పోలీసులు వృద్ధుడికి చేస్తున్న సేవకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



వృద్ధుడికి బట్టలు వేస్తున్న కానిస్టేబుల్

సన్మానం

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ బలియమైన రాజకీయ శక్తిగా ఎదిగిందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ఉపాధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా ప్రముఖ న్యాయవాది ఉలేపే రాకేష్‌కురుమ ఆయనను కలిసి సన్మానించి అభినందించారు.



శిశుమందిరాలు
సామాజిక మార్పునకు నాంది కావాలి



సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు



శిశుమందిరాల ప్రధానాచార్యులను సన్మానిస్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదాదామంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ రాష్ట్రస్థాయి వర్షారంభ సమావేశాలు సోమవారం ప్రారంభమైయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యాభారతీ దక్షిణ మధ్యక్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో విద్యా రంగంలో విలువలు, సామాజిక భావన నిర్మాణం కోసం శిశు మందిరాల మధ్యమంగా అనేక మంది విద్యావేత్తలు సమయం ఇచ్చి సేవ చేస్తున్నారన్నారు. శిశుమందిర కేంద్రంగా సమాజంలో సామాజిక మార్పు రావాలన్నారు. అందుకోసమే శ్రీ సరస్వతి శిశు మందిరాలు ప్రారంభించడం జరిగిందన్నారు. వెనుకబడిన బస్తీల్లోకి వెళ్లి, బస్తీ కేంద్రంగా ప్రతి శిశుమందిరాల కూడా సంస్కార కేంద్రం ద్వారా, బస్తీ కేంద్రాంగా సంస్కార కేంద్రాలు ప్రారంభించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని శిశు మందిరాల ప్రధానాచార్యులు, కార్యదర్శులు 529 మంది వర్షారంభ సమావేశంలో పాల్గొన్నారు. విద్యాభారతీ దక్షిణ మధ్యక్షేత్ర అధ్యక్షులు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్ రావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ముక్కాల సీతారాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 10వ తరగతి ఫలితాల్లో వంద శాతం ఫలితాలు సాధించిన శిశుమందిరాల ప్రధానాచార్యులను ఘనంగా సత్కరించారు.

మొహర్రం సంతాప దినాలకు భారీ ఏర్పాట్లు

గోల్కొండ: మొహర్రం సంతాప దినాల కార్యక్రమం నిర్వహించడానికి గోల్కొండ కోట అషూర్‌ఖానా వద్ద భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి 10 రోజుల పాటు గోల్కొండ కోట సమీపంలోని అషూర్‌ఖానాలో సబీల్ అనే పేరిట ఈ కార్యక్రమాన్ని షియా ముస్లింలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా అషూర్‌ఖానాలో మజాలిష్ నిర్వహించి సంతాప గీతాలు పాడతారు. పవిత్ర కర్బల మైదానంలో అమరులైన ప్రవక్త మహమ్మద్ కుటుంబ సభ్యుల వీరగాథలను ఈ మజాలిష్‌లో పాడతారు. పది రోజుల పాటు అన్నదానం నిర్వహిస్తారు.

కరుణాకర్ సేవలు వెలకట్టలేనివి



దేవర కరుణాకర్ కుటుంబ సభ్యులతో గవర్నర్ బండారు దత్తాత్రేయ

గోల్కొండ: దివంగత నేత, గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ దేవర కరుణాకర్ సేవలు వెలకట్టలేనివని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సోమవారం ఆయన గుడిమల్కాపూర్ గాయత్రీనగర్‌లోని దివంగత నేత కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలకు పైగా దివంగత కరుణాకర్ పార్టీ పటిష్టానికి కృషి చేశారన్నారు. బీజేవైఎం నాయకులు దేవర వంశీ, బీజేపీ కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ తదితరులున్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



మంచిరేవుల బోనాల ఉత్సవాలలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్



తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు



కోకాపేట పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు



మణికొండ క్వార్టర్స్ అమ్మవారి పూజలో పాల్గొన్న కౌన్సిలర్లు

మణికొండ: ఆషాఢమాసం బోనాల ఉత్సవాలు సోమవారం సైతం నిర్వహించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో పలహారం బండి ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కట్టమైసమ్మకు పెద్ద ఎత్తున భక్తులు బోనాలను సమర్పించారు. మంచిరేవులలో బోనాలు, తొట్టెల ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. కోకాపేటలో జరిగిన పలహారం బండి ఊరేగింపు, కట్టమైసమ్మ బోనాల ఉత్సవాలలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండగలు అందరు కలిసికట్టుగా ఆనందంగా జరుపుకోవాలని, గ్రామ దేవతలు మనందరిని చల్లగా చూస్తారన్నారు. ఎమ్మెల్యేతో పాటు పూజలలో నార్సింగి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్ యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం. ప్రవీణ్‌యాదవ్, నాయకులు నర్సింహా, ఆంజనేయులు, హరిశంకర్, ఆండాలు, మల్లేష్, నీలేష్ ప్రసాద్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. మంచిరేవులలో జరిగిన బోనాల ఉత్సవాలలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆయా గ్రామాలలో ఆలయాల కమిటీలు, కౌన్సిలర్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మణికొండ క్వార్టర్స్‌లో దివ్యజ్యోతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పలహారం బండి ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు పి.శైలజ వినోద్, కె. రామకృష్ణారెడ్డి, యాలాల లావణ్యనరేష్, ఎల్. వందన నగేష్‌లు పాల్గొన్నారు.



కోకాపేటలో కట్టమైసమ్మకు బోనాలు సమర్పించిన గ్రామస్థులు



మణికొండ క్వార్టర్స్‌లో పలహారం బండి ఊరేగింపు

గృహ నిర్మాణాల క్రమబద్ధీకరణ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గృహ నిర్మాణాల క్రమబద్ధీకరణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చార్మినార్ జోన్‌లో రాజేంద్రనగర్ సర్కిల్‌ను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోనున్నట్లు సమాచారం అందుతోంది. ఇందుకోసం అధికారులు, రెవిన్యూ సిబ్బంది ముమ్మరంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు తమ వార్డుల వారిగా తగు ఏర్పాట్లు ప్రారంభించారు. అధికారులు ఆదేశించగానే ప్రతి ఇంటి సర్వేను చేపట్టనున్నారు. ప్రస్తుతం చెల్లిస్తున్న ఆస్తిపన్ను, భవన నిర్మాణాల అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తదితర వాటన్నింటిని పరిశీలించి నమోదు చేయనున్నారు. అనుమతులకు అదనంగా అంతస్తులు, నిర్మిస్తే వాటిని సైతం రికార్డు చేయనున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ బయిలా ప్రకారం వీటికి సైతం ఆస్తిపన్నును జోడించనున్నట్లు తెలుస్తుంది. అదనపు అంతస్తులు నిర్మించిన వారు బీఆర్ఎస్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇందుకోసం అనేక మంది గతంలో దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ అధికారులు ఈ సర్వే చేపడితే అందరికి లాభం చేకూరనుంది. ప్రభుత్వానికి సైతం అదనంగా ట్యాక్స్‌ల రూపంలో నగదు రానుంది.

చిన్నారులను క్రీడల్లో ప్రోత్సహించాలి



పోటీలలో గెలుపొందిన చిన్నారులు

గన్‌ఫౌండ్రీ: జాతీయస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలను కొల్లూరులోని గుడియం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ కోచ్ ప్రియాంక మాట్లాడుతూ..చిన్నారులను పాఠశాల స్థాయి నుంచే క్రీడల వైపు మక్కువ కల్పించేలా ప్రోత్సహించాలని సూచించారు. కళాపత్రు అకాడమీకి చెందిన 29 మంది విద్యార్థులు 85 మెడల్స్‌ను సాధించడం విశేషమని కొనియాడారు. అనంతరం వివిధ విభాగాలలో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు.

ఘనంగా తొట్టెల ఊరేగింపు



అత్తాపూర్: శివరాంపల్లిలో తొట్టెల ఊరేగింపు కార్యక్రమం అంగరంగవైభవంగా కొనసాగింది. బోనాల పండుగ మరుసటి రోజు తొట్టెల కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాటు చేసుకుంటారు. తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో చిన్న, పెద్ద అనే తారతమ్యం లేకుండా పాల్గొంటారు. గ్రామంలోని వీధుల గుండా తొట్టెలను ఊరేగింపుతో వెళ్తారు. శివసతుల నృత్యాలు, పోతురాజుల విన్యాసాలు, డీజే సౌండ్‌లతో ఆటాపాటల నడుమ అమ్మవారి తొట్టెల ఊరేగింపు నిర్వహిస్తారు. ఊరేగింపుగా వచ్చే అమ్మవారికి భక్తులు నైవేద్యం సమర్పించుకుంటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్తాపూర్ పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

కాలుష్య రహిత నిర్మాణాలను స్వాగతిద్దాం

లంగర్‌హౌస్: నేటి సాంకేతిక విధానంతో కాలుష్య రహిత నిర్మాణాలకు పెద్దపీట వేద్దామని మహీంద్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ కల్యాణ్‌రామ్ అన్నారు. అదానీ సిమెంట్, ఏసీసీ, అంబుజా సిమెంట్, ఇండియా కాంక్రీట్ ఇన్‌స్టిట్యూట్(ఐసీఐ)తో కలిసి సంయుక్తంగా హైదరాబాద్‌లోని మందార్ రెస్టారెంట్‌లో ఎంబెడెడ్ సెన్సార్‌లను ఉపయోగించి 'కాంక్రీట్ నిర్మాణాల జీవిత చక్రాన్ని పర్యవేక్షించడం' అనే అంశంపై కాంక్రీట్ టాక్‌ను నిర్వహించారు. కాంక్రీట్ నిర్మాణాల జీవిత చక్రాన్ని పర్యవేక్షించడానికి ఎంబెడెడ్ సెన్సార్‌లను ఉపయోగించే వినూత్న విధానంపై తన నైపుణ్యాన్ని పంచుకున్న మహీంద్రా విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ కల్యాణ్‌రావు ఈ కార్యక్రమంలో కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవంతో ముందుకు వెళ్తుందన్నారు. ఐసీఐ చైర్మన్ వెంకటేశ్వరరావు, టెక్నికల్ హెడ్ ఏడుకొండలు, ఏరియా మేనేజర్ ఆరిఫ్ షేక్, టెక్నికల్ సర్వీసెస్ ఇంజినీర్ తౌసీఫ్ నజీర్, పి.వెంకటేశ్వర్లు, టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ అవినాష్, దానిష్, నర్సింహ పాల్గొన్నారు.

కోటకు పోటెత్తిన పర్యాటకులు



గోల్కొండ కోటలో పర్యాటకులు

గోల్కొండ: గోల్కొండ కోటకు పర్యాటకులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో వేల సంఖ్యలో కోటకు పర్యాటకులు తరలివచ్చారు. ఆషాఢ మాసం కావడంతో గత పది రోజులుగా కోట భక్తులతో కిటకిటలాడుతుంది. దీనికి తోడు సోమవారం కూడా భక్తులు తరలివచ్చారు. యువకులు పోటాపోటీగా కుతుబ్‌షాహీ రాజుల కాలం నాటి ఫిరంగుల వద్ద సెల్ఫీలు దిగారు.